# విధి వైపరీత్యం

అది శీతాకాలం. రాత్రి పది గంటలు కావస్తోంది. చలి ఎముకలను కొరికేస్తోంది. రాహుల్ అప్పుడు తను వేసుకుని వున్న పాంటు, షర్టులలో వున్నాడు. కప్పుకోవడానికి దుప్పటి లాంటిది ఏదీ లేదు.

జైలు నుంచి విడుదలయి వచ్చిన ఈ వారం రోజులలో తన దగ్గర డబ్బంతా ఖర్చయిపోయింది. ఇప్పుడు కొనుక్కుని తినడానికి కూడా డబ్బేమీ లేదు. ఈ ఒక్క రాత్రి ఆకలిని, చలిని ఎలాగో భరించి మర్నాడు ఏమైనా సరే, ఎలాగయినాసరే జైలుకు వెళ్లాలి. అక్కడయితే తిండి, వసతి రెండూ వుంటాయి. అందుచేత ఏదో ఒక తప్పు పని చేసి పోలీసులకు దొరికిపోవాలి. ఈ నిశ్చయంతో ఓవర్ బ్రిడ్జి షెల్టరులో పడుకున్నాడు రాహుల్.

మర్నాడు ఉదయం సూర్యోదయ సమయానికి మేలుకున్నాడు రాహుల్. కొంచెంసేపు గడిచాక ఎండలో వచ్చిన వెచ్చదనానికి కాస్త చలి తగ్గింది. ఇక జైలుకు వెళ్లే ప్రయత్నాలు మొదలుపెట్టదల్చుకున్నాడు.

బజారులో ఒక బట్టల దుకాణం ముందు గుమ్మం దగ్గర పెట్టి వున్న ఒక కొత్త గొడుగుని రాహుల్ తీసుకుని అక్కడే నిలబడ్డాడు. అప్పుడే ఆ షాపునుంచి బయటకు వచ్చిన మనిషి రాహుల్‌తో "ఆ గొడుగు మీదయితే మీరే తీసుకువెళ్లండి. అది నాకు పార్కులో ఒక బెంచీ మీద దొరికింది. అక్కడ ఎవరూ నాకు కనబడలేదు. అందుచేత ఆ గొడుగును నేను తీసుకున్నాను" అని చెప్పి వెళ్లిపోయాడు.

రాహుల్ మొదటి ప్రయత్నం ఫలించలేదు.

తరువాత రాహుల్ ఒక పెద్ద హోటల్‌కు వెళ్లి కావాల్సిన ఫలహారాలన్నీ కడుపునిండా తిని, టీ తాగాడు. వెయిటర్ ఇరవై రూపాయలకు బిల్లు ఇచ్చాడు. రాహుల్ హోటల్ మేనేజర్‌తో బిల్లు చెల్లించడానికి తన దగ్గర డబ్బులేదని చెప్పాడు. పోలీసులకు తనను పట్టించి జైలుకు పంపిస్తారని అనుకున్నాడు రాహుల్. కాని ఆ మేనేజరు తన మనుషుల చేత రాహుల్‌ని చావగొట్టించి బయటకు గెంటించాడు. రాహుల్ రెండవ ప్రయత్నం కూడా ఎదురయి బెడిసికొట్టింది.

రాహుల్ ఒక పెద్ద ఫ్యాన్సీ షాపు దగ్గరకు వెళ్లి దాని అద్దం మీద ఒక పెద్ద రాయి విసిరి దానిని పగలగొట్టాడు. ఆ చప్పుడుకు అక్కడి జనం భయపడి పారిపోతున్నారు. రాహుల్ మాత్రం అక్కడే నిలబడి వున్నాడు. అక్కడ ఏం



జరిగిందో తెలుసుకుందామని అక్కడికి వచ్చిన ఒక పోలీసుతో ఆ షాపు మేనేజర్ అద్దాన్ని ఎవరో పగలగొట్టారని చెప్పాడు. అప్పుడు రాహుల్ తనే ఆ అద్దాన్ని పగలగొట్టానని పోలీసుకు చెప్పాడు. పోలీసు నవ్వి "తప్పు పని చేసినవాడు నన్ను చూడగానే పారిపోతాడుగాని తప్పు చేసినట్లుగా తనే వచ్చి నాకు ఎన్నడూ చెప్పడు. నాతో జోక్ వెయ్యకుండా వెళ్లి నీ పని చూసుకో" అని చెప్పి పరుగెత్తుకుని పోతున్న జనం వైపు వెళ్లాడు. దీనితో రాహుల్ చేసిన మూడవ ప్రయత్నం కూడా ముక్కలయింది.

సాయంకాలమయింది. ఈసారి ఏ విధంగానైనాసరే పోలీసులకు పట్టుబడి తను జైలుకు వెళ్లాలనే నిశ్చయంతో రాహుల్ ఒక పార్కులోకి వెళ్లాడు. అక్కడ ఒక బెంచి మీద ఒక యువతి ఒంటరిగా కూర్చుని వుంది. రాహుల్ ఆమె భుజం మీద చెయ్యివేసి "ఐ లవ్ యు" అని అన్నాడు. వెంటనే ఆమె నవ్వుతూ "ఐ టూ లవ్ యూ" అని అతని చెయ్యి పట్టుకుంది. పోలీసును పిలిచి తనను జైలులో పెట్టించడానికి బదులు ఇలా రివర్స్‌గేర్‌లో ప్రేమ ఒలకపోస్తోందేమిటి అని అనుకుని రాహుల్ ఆమె చేతినుండి విడిపించుకుని గబగబా నడుస్తూ పార్కు బయటకు వచ్చేశాడు. తన నాల్గవ ప్రయత్నం కూడా ఉపయోగపడలేదు.

జైలులోకి వెళ్లడానికి మార్గం ఏమిటా అని ఆలోచిస్తూ ఒక గుడి పక్కగా నెమ్మదిగా నడచి వెళ్తున్నాడు రాహుల్. అప్పుడు ఆ గుడిలో నుంచి స్పీకర్ ద్వారా చెవికి ఇంపయిన ఒక భక్తిపాట వినిపిస్తోంది. ఆ పాట అతని కాళ్లకి బంధం వేసింది. ఆ క్షణంలో అతని హృదయంలో పరివర్తన కలిగింది. ఇక తన దొంగతనాలకు స్వస్తి చెప్పి ఒక మంచి జీవితాన్ని గడపాలనే నిర్ణయం తీసుకున్నాడు.

"ఏయ్! ఇక్కడేం చేస్తున్నావ్? నిన్ను చూస్తుంటే నాకు అనుమానంగా వుంది. గుడికి వచ్చే ఆడవాళ్ల నగలు కాజేయడానికి నిలబడ్డావా?" అంటూ అరిచాడు అప్పుడే అక్కడికి వచ్చిన ఒక పోలీసు. ఆ సమయంలో మాసిన గడ్డంతోను, మురికి బట్టలతోను వున్న కారణంగా పోలీసు అతనిని అనుమానించాడు. భవిష్యత్తులో తను ఊహించుకుంటున్న మంచి జీవిత కలలు మాని "లేదు సార్. నేను దొంగతనం చెయ్యడానికి రాలేదు. వీనుల విందుగా తియ్యని పాట గుడిలో నుంచి వినిపిస్తున్నదని ఇక్కడ నిలబడ్డానండి" అన్నాడు రాహుల్.

"నీకు తియ్యని విందు జైలులో చేస్తాం. పద పోలీస్ స్టేషన్‌కి" అని పోలీసు రాహుల్‌ను తీసుకువెళ్లాడు.

రాహుల్ తను జైలుకు వెళ్లడానికి ప్రయత్నం చేసిన ప్రతిసారి అనుకున్నట్లుగా జరగలేదు. కాని మంచి జీవితాన్ని ప్రారంభించుదామని అనుకున్నప్పుడు జైలుకు వెళ్లవల్సి వచ్చింది. విధి వైపరీత్యం!

**-కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి (హైదరాబాద్)**





